సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం : 24 : ఫిబ్రవరి : 2023



రూ.9.20 లక్షల గంజాయి పట్టివేత

మహారాష్ట్రకు తరలిస్తున్న రూ.9.20లక్షల విలువైన గంజాయిని మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి–44పై పోలీసులు పట్టుకున్నారు. గురువారం వివరాలు వెల్లడించారు. 8లో▸



జాతరకు సిరిచెల్మ ముస్తాబు

సిరిచెల్మ మల్లన్న ఆలయం జాతరకు ముస్తాబైంది. శుక్రవారం ఉదయం ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
37.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

మార్చి 4లోగా ఓపెన్‌స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: తత్కాల్ ద్వారా మార్చి 4వరకు ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో ప్రణీత, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్‌ను సంప్రదించాలని సూచించారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

• డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్



మాట్లాడుతున్న సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌అర్బన్: రాబోయే సాధారణ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది కాంగ్రెస్ పార్టీయేనని జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ధీమా వ్యక్తంజేశారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమాన్ని నాలుగోరోజు గురువారం పట్టణంలోని పిట్టలవాడ కాలనీలో నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్, ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు, ఏకకాలంలో రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీ ఉంటుందని కాలనీ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ గండ్రత్ సుజాత, నాయకులు సంజీవరెడ్డి, గుడిపల్లి నగేశ్, శివాజీ కాంబ్లే, శంషొద్దీన్, సంతోష్, రాజు, గౌస్‌బాయ్, కోటేశ్, తాహెర్, కవిత, గంగమ్మ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి



భాగ్యలక్ష్మిని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

కైలాస్‌నగర్: రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా జిల్లా కేంద్రానికి చెందిన బీ భాగ్యలక్ష్మి ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు గురువారం హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్‌లో నిర్వహించారు. బీసీ వెల్ఫేర్ శాఖలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా విధులు నిర్వహించిన ఆమె ఇటీవల రిటైర్డ్ అయ్యారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యవర్గంలోనూ వివిధ హోదాల్లో పనిచేసి గుర్తింపు పొందారు. ఆమెకు టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్‌కుమార్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, కిష్టయ్య, నిర్మల్ జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న, కార్యదర్శి హన్మంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పాస్‌పుస్తకాలు అందజేస్తున్న అధికారులు

ఇచ్చోడ: గ్రామీణ ప్రాంత ప్రజలు తపాలా సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని బీహార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేందర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తపాలా కార్యాలయంలో నిర్వహించిన పొదుపు మహామేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తపాలాశాఖ నేటికీ అనేక రకాల సేవలు అందిస్తున్నదని తెలిపారు. పోస్ట్‌మాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్ పీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. తపాలా సేవల గురించి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పలువురికి పాస్‌పుస్తకాలు అందజేశారు. తపాలాశాఖ జిల్లా అధికారి కేబీఆర్ ప్రసాద్, స్థానిక సర్పంచ్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

27న మానసిక ఒత్తిడి నివారణపై ప్రత్యేక కార్యక్రమం

ఎదులాపురం: మానసిక ఒత్తిడి నివారణకు ఈనెల 27న 'మనోబలం ద్వారా మానసిక ఒత్తిడిపై విజయం' అనే అంశంపై ప్రత్యేక మోటివేషనల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ విశ్వవిద్యాలయ కేంద్రం నిర్వాహకురాలు రేవతి బెహన్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ ఆఫీస్ సమీపంలోని విశ్వవిద్యాలయ కేంద్రంలో ఈ కార్యక్రమం సోమవారం సాయంత్రం 6.30నుంచి 8గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ సబ్ జోనల్ బ్రాంచ్ డైరెక్టర్ రాజయోగిని కుల్దీప్ దీదీ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్డర్ అద్దాలు అందలే..

- కంటివెలుగులో రీడింగ్ కళ్లజోళ్లే..
- పంపిణీ చేయని ప్రిస్క్రిప్షన్ అద్దాలు
- ఇంటికే పంపిస్తామని ఇయ్యట్లే..
- నెల దాటినా 1,574 మందికే..
- కళ్లు కాయలు కాసేలా నిరీక్షణ
- పేదల్లో వెలుగులు నింపని పథకం

జిల్లాలో కంటివెలుగు అమలు ఇలా..

పరీక్షలు చేయించుకున్నవారు	1,10,218
పంపిణీ చేసిన రీడింగ్ గ్లాసులు	15,489
అవసరమైన ప్రిస్క్రిప్షన్ అద్దాలు	15,991
పంపిణీ చేసిన ప్రిస్క్రిప్షన్ అద్దాలు	1,574



కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంఈ రమేశ్‌రెడ్డి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన కంటివెలుగు పథకం పేదల కళ్లల్లో వెలుగులు నింపడం లేదు. అంధత్వ నివారణే లక్ష్యంగా రెండో విడత కార్యక్రమాన్ని జనవరిలో ప్రారంభించారు. నెల గడిచినా ప్రిస్క్రిప్షన్ (దూరపుచూపు) కళ్లద్దాల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మొదటి విడతలోనూ చాలామంది లబ్ధిదారులకు ఇంకా అద్దాలు అందలేదు. రెండో విడతలో జిల్లాలో 33 కంటివెలుగు కేంద్రాలు ఏర్పాటు చేయగా, కార్యక్రమం సజావుగా సాగుతోంది. కానీ.. దూరపు చూపు కళ్లద్దాలు పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాకు 1,574 మందికే ప్రిస్క్రిప్షన్ అద్దాలు పంపిణీ చేశారు. అధికారులు ఆర్డర్ పెట్టినప్పటికీ సరఫరాలో జాప్యం జరుగుతోంది.

తప్పని నిరీక్షణ..

జిల్లాలో జనవరి 19నుంచి రెండో విడత కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. ఆదిలాబాద్ పట్టణంలో ఆరు కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో 27 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 1,10,218 మందికి పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే పరీక్షలు చేయించుకున్నవారిలో అవసరమైన వారికి 15,489 రీడింగ్ అద్దాలు అందజేశారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న వారి కోసం 15,991 ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీటి కోసం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారులు ప్రభుత్వానికి ఆర్డర్ పెట్టారు. అయితే ఇప్పటివరకు 1,574 ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు మాత్రమే జిల్లాకు వచ్చాయి. ప్రభుత్వం ఓ ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని వీటిని సరఫరా చేస్తోంది. ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు అవసరమున్న వారి వివరాలు అధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నా పంపిణీలో జాప్యం జరుగుతోంది. కళ్లద్దాలు వచ్చిన వెంటనే ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ.. చాలామందికి ఇంకా పంపిణీ జరగక నిరీక్షిస్తున్నారు.

జనాల్లో తగ్గుతున్న ఆసక్తి

కంటివెలుగుపై జనాల్లో ఆసక్తి తగ్గుతోంది. కేంద్రాల్లో కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు అవసరమైన వారికి ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు పంపిణీ చేయడం లేదు. దీంతో జనాలు కేంద్రాలకు పూర్తి స్థాయిలో రావడంలేదన్న ప్రచారం జరుగుతోంది. రీడింగ్ అద్దాలకు ఎంపికైన చాలామంది లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. అవసరమైనవారికి శస్త్రచికిత్స చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు ఏ ఒక్కరికీ చేయలేదు. దీంతో జనాల్లో కంటివెలుగుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి.

తొలి విడతలోనూ ఇదే పరిస్థితి

రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగు మొదటివిడత కార్యక్రమాన్ని 2018 ఆగస్టులో ప్రారంభించింది. 2019 ఫిబ్రవరి వరకు జిల్లాలో 3,49,373 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 54,379 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. 32,978 మందికి ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు అవసరమని గుర్తించి 27,464 మందికే పంపిణీ చేశారు. 36,742 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించినా ఒక్కరికీ ఆపరేషన్ చేయలేదు. రెండో విడతలోనూ కళ్లజోళ్ల పంపిణీ పూర్తి స్థాయిలో జరగడంలేదు. అలాగే ఇప్పటివరకు ఒక్క శస్త్ర చికిత్స కూడా నిర్వహించలేదని అధికారులే చెబుతున్నారు.

అందరికీ కళ్లజోళ్లు అందజేస్తాం



జిల్లాలో ఇప్పటివరకు 15,991 మందికి ప్రిస్క్రిప్షన్ కళ్లద్దాలు అవసరమని గుర్తించాం. వీటి కోసం ప్రభుత్వానికి ఆర్డర్ పెట్టాం. 1,574 మందికి అద్దాలు వచ్చాయి. వాటిని లబ్ధిదారులకు అందజేస్తాం. కంటి పరీక్షలు చేసుకున్న వారికి వెంటనే రీడింగ్ గ్లాసులు అందజేస్తున్నాం. ప్రతిఒక్కరూ కంటివెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

25న మున్సిపల్ సమస్యలపై 'సాక్షి ఫోన్ ఇన్'

ఉదయం 11నుంచి 12గంటల వరకు



శైలజ, మున్సిపల్ కమిషనర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన మున్సిపల్ కమిషనర్ ఏ శైలజతో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్యక్రమం కొనసాగనుంది. ఆదిలాబాద్ పట్టణంలో కుక్కలు, పందుల బెడద, తాగునీటి సరఫరాలో అంతరాయం, పారిశుధ్య సమస్య, వీధి లైట్లు వెలగకపోవడం తదితర సమస్యలను ప్రజలు 9010201689, 9848890171 నంబర్లకు ఫోన్ చేసి కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు.

ఘనంగా సేవాలాల్ జయంతి



పూజలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో గురువారం సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న బంజారా భవన నిర్మాణానికి రూ.కోట్ల విలువ చేసే ఎకరం స్థలాన్ని జిల్లా కేంద్రంలో కేటాయించారని తెలిపారు. భవన నిర్మాణం కోసం త్వరలో నిధులు కూడా మంజూరు చేయిస్తారని చెప్పారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవాలాల్ 300 ఏళ్ల కిందటే ఆవును పూజించాలని సూచించారని పేర్కొన్నారు. ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో బంజారా భవన నిర్మాణానికి నెల రోజుల్లో రూ.కోటి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. బంజారాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాథోడ్ సురేశ్‌నాయక్, పవార్ దేవిదాస్, మాజీ కేంద్ర మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీలు రమేశ్‌రాథోడ్, గోడం నగేశ్, మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్, జెడ్పీటీసీలు అనిల్ జాదవ్, చారులత రాథోడ్, నాయకులు శ్యాంనాయక్, నరేశ్ జాదవ్, ఆడే గజేందర్, భరత్ చౌహాన్ పాల్గొన్నారు.

పదోరోజుకు పిప్పల్‌కోటి రైతుల రిలేదీక్ష



రిలేదీక్ష శిబిరంలో కూర్చున్న రైతులు

తాంసి: పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురై సాగుభూములు కోల్పోతున్న తమకు పరిహారం చెల్లించాలని రైతులు రిజర్వాయర్ నిర్మాణ స్థలంలో చేపట్టిన రిలేదీక్ష గురువారం పదోరోజుకు చేరింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే పరిహారం పెంచి ఎకరాకు రూ.20లక్షల చొప్పున అందజేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. శిబిరంలో నసీరుద్దీన్, స్వామి, నర్సింగ్, దత్తు తదితరులు కూర్చున్నారు.

'ఎస్టీ జాబితాలో చేర్చితే ఆందోళన ఉధృతం'



కేస్లాపూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: ఎస్టీ జాబితాలో మరో 11 కులాలను చేర్చితే ఆందోళనలు ఉధృతం చేస్తామని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచ్చయ్యా హెచ్చరించారు. గురువారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఏర్పాటు చేసిన తుడుందెబ్బ అత్యవసర సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు, రాయిసెంటర్ సార్‌మెడిలు, ఆయా గ్రామాల పెద్దల అభిప్రాయాలు సేకరించారు. మరో ఉద్యమాన్ని ప్రారంభించే ముందు రాష్ట్ర, జిల్లా, మండల, విద్యార్థి సంఘాల పునర్నిర్మాణం జరగాలన్నారు. ఆదివాసీ సర్పంచుల ఫోరంను తుడుందెబ్బకు అనుబంధ సంఘంగా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయా పార్టీలకు రాజీనామాలు ప్రకటించాలని, ప్రతీ మండలంలో 11 కులాలను ఎస్టీ జాబితాలో కలపవద్దని తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల ఎదుట ధర్నా, ముట్టడి కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించారు. అనంతరం పోచ్చయ్యా మాట్లాడారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రభుత్వ వ్యతిరేక విధానంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చే నిర్ణయాన్ని రద్దు చేసేవరకూ కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, రాయిసెంటర్ జిల్లా మేడి మెస్రం దుర్గు, ఆదివాసీ సంఘాల నాయకులు అనతక దేవేందర్, రాయిసిడాం జంగు, పెందోర్ పుష్పరాణి, పుర్క బాపూరావ్, సోయం రాందాస్, పెందోర్ ఆర్జున్, జంగు, కోవ ఇంద్ర, కోట్నాక్ తిరుపతి, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు కోట్నాక్ బారిక్‌రావ్, మండలాధ్యక్షుడు జుగ్నాక్ భరత్ తదితరులున్నారు.

'యువతను మోసగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం'



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను మోసం చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి ప్రకటనలతోనే వారిని నయవంచనకు గురి చేస్తోందని విమర్శించారు. మరోవైపు కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం యువతను విద్యావంతులు, సుశిక్షితులుగా తయారు చేస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. రుణాలు కూడా ఇచ్చి స్టార్టప్ కంపెనీలు ప్రారంభించేలా ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. మేక్ ఇన్ ఇండియా పథకం ద్వారా దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ ఎగుమతులను కూడా ప్రోత్సహిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. వారిని మత్తుకు బానిసలను చేస్తూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున మద్యం దుకాణాలు తెరిచిందని మండిపడ్డారు. నాయకులు దినేశ్ మటోలియా, ఆకుల ప్రవీణ్, మయూర్ చంద్ర, లోక ప్రవీణ్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, కృష్ణయాదవ్, వేదవ్యాస్ పాల్గొన్నారు.

అటవీభూములకు హక్కుపత్రాలు ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కైలాస్‌నగర్: ఆదివాసీలు సాగు చేస్తున్న అటవీ భూములకు ఎలాంటి షరతులు లేకుండా హక్కుపత్రాలు ఇవ్వాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో కలపవద్దని, పేసా 1/59, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. గిరివికాసం పథకం కింద ఆదివాసీలకు బోర్లు వెంటనే మంజూరు చేయాలని కోరారు. జిల్లా, మండల కేంద్రాల్లో నివాసముంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, జీవో 3ను యథావిధిగా అమలు చేయాలన్నారు. నాయకులు గోడం గణేశ్, కుంర శ్యాంరావు, కుంర జంగు పటేల్, మెస్రం పరమేశ్, మహిళా సంఘం నాయకులు గోడం రేణుక, ఉయిక ఇందిర తదితరులున్నారు.

చెక్‌పోస్టులో డ్యూటీల వివాదం

- ఏడాదిగా కొనసాగుతున్న తంతు
- సీనియర్ ఎంవీఐ వర్సెస్ ఆఫీసర్లు
- డిప్యూటేషన్లు పెరిగి తగ్గిన డ్యూటీలు
- అక్రమ ఆదాయంపై దీని ప్రభావం
- ఆ అధికారి డబ్బుల కోసం వేధిస్తుండని మంత్రి, ఎమ్మెల్యేకు ఫిర్యాదు



భోరజ్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు ఆపుతున్న రవాణాశాఖ సిబ్బంది

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలోని జైనథ్ మండలం భోరజ్ సమీకృత చెక్‌పోస్టులో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల మధ్య డ్యూటీల వివాదం ఏడాది కాలంగా కొనసాగుతోంది. ఇటీవల తీవ్రత పెరగడంతో వ్యవహారం బయటకొచ్చింది. ప్రధానంగా వివిధ రంగాల్లో తన ప్రభావంతో పాటు ప్రాబల్యం కలిగి ఉన్న ఓ సీనియర్ ఎంవీఐ వర్సెస్ ఇతర ఆఫీసర్ల మధ్య ఈ వార్ కొనసాగుతోంది. ఇది కాస్త ముదరడంతో చెక్‌పోస్టుల్లో సాధారణ తంతుగా జరిగే అక్రమ వ్యవహారాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి.

మంది పెరిగితే మజ్జిగ పల్చన చందంగా..

మంది పెరిగితే మజ్జిగ పల్చనా.. అన్నట్టుగా అక్రమ ఆదాయం పరిస్థితి ఈ చెక్‌పోస్టుపై ఉంది. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లకు సంబంధించి చెక్‌పోస్టులో ఏడు రెగ్యులర్ పోస్టులు ఉండగా, ప్రస్తుతం ఆన్ డ్యూటీ, పూర్తి అదనపు చార్జీలతో 20 మంది వరకు డ్యూటీ నిర్వహిస్తున్నారు. దీంతో నెలకు సగటున ఒక్కొక్కరికి ఒకటిన్నర రోజుల డ్యూటీ మాత్రమే దక్కుతుంది. డ్యూటీ తగ్గితే సంబరపడాల్సింది పోయి ఇక్కడ వివాదానికి కారణం ఎందుకైందంటే.. ఎన్ని ఎక్కువ డ్యూటీలు చేస్తే అంత ఎక్కువ అక్రమ ఆదాయం లభిస్తుంది. ఏడాది కాలంగా కొంతమంది ఇలా డిప్యూటేషన్లపై వస్తుండడం, ఇక్కడ ఉన్న వారి డ్యూటీల సంఖ్య తగ్గుతుండడం జరుగుతూ వస్తోంది. తాజాగా ఇటీవల 19వ సంఖ్య నుంచి మరొకటి పెరగడంతో అప్పటివరకు ఓ స్థాయిలో ఉన్న వివాదం మరింత తీవ్రమైంది. ఒక్కరోజు డ్యూటీ చేస్తే అక్రమ ఆదాయం రూ.లక్షల్లో వెనకేసుకునే పరిస్థితి ఉండడమే ఈ వివాదం ముదరడానికి కారణమైంది.

నేతలకు చేరిన పంచాయితీ

ఓ సీనియర్ ఎంవీఐ తనకే అదనపు డ్యూటీలు కేటాయించాలని, లేనిపక్షంలో రూ.లక్షల్లో ముట్టజెప్పాలని తమను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నను కొద్దిరోజుల కిందట కలిసి మొరపెట్టుకున్నారు. అయితే ఇన్నిరోజులు దాటినా సదరు నేతల నుంచి ఎలాంటి ప్రతిచర్య కనిపించడం లేదన్న ఆందోళన వారిలో కనిపిస్తోంది. సదరు సీనియర్ ఎంవీఐ ప్రాబల్యం కారణంగానే ఈ పరిస్థితి ఎదురవుతోందా? అని వారిలో మీమాంస మొదలైంది. ఆ అధికారి బెదిరించినట్టుగానే ఏసీబీ, విజిలెన్స్ చేయిస్తారా? అనే గుబులు కూడా కనిపిస్తోంది. ఈ చెక్‌పోస్టును సెట్ చేయండి.. అని వారు నేతలకిచ్చిన ఫిర్యాదు పత్రంలో వేడుకున్నారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ విషయంలో డీటీసీ పుప్పాల శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కోర్టు విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

బోథ్: న్యాయవాది నరపాక సురేందర్‌పై దాడికి నిరసనగా బోథ్ బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం కోర్టు విధులను బహిష్కరించారు. వారు మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, రక్షణ కల్పించాలని కోరారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వామన్‌రావ్ దేశ్‌పాండే, సెక్రటరీ పంద్రం శంకర్, సుభాష్, అంగద్ కేంద్రె, సంగెం సుధీర్, ఆడెపు హరీశ్, కుమ్మరి విజయ్‌కుమార్ ఉన్నారు.

పంట రక్షణకు మంచె ఉపాయం



ఆరుగాలం కష్టించి పంటలు సాగు చేస్తున్న రైతన్నలు వాటి రక్షణకు అనేక పాట్లు పడుతుంటారు. అందులో ఒకటే ఈ చిత్రం. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రానికి చెందిన రైతుల సాగుభూములు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉంటాయి. పంటలకు వన్యప్రాణులు, పక్షుల నుంచి ముప్పు పొంచి ఉంది. వాటి నుంచి రక్షించుకునేందుకు గిరి రైతులు ఇంకా పురాతన పద్ధతులు పాటిస్తున్నారు. పంట చేన్లలో మంచెలు ఏర్పాటు చేసుకుని పగలు, రేయి వాటిపైనే ఉండి పంటలను రక్షించుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

ఏఐసీసీ సభ్యుడిని కలిసిన దీక్షిత్‌రావు పాటిల్



జానారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న పాటిల్

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన యువ నాయకుడు సిందే దీక్షిత్ రావు పాటిల్ ఏఐసీసీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి జానారెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యుడు జానారెడ్డి ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందని, యువకులు చైతన్యవంతులై రాజకీయంలోకి రావాలని సూచించినట్లు దీక్షిత్ పాటిల్ తెలిపారు.

బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన జిల్లా నాయకులు



తరుణ్‌ఛుగ్‌తో జిల్లా నాయకులు

నర్సాపూర్(జి): బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్, రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ని గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో జిల్లా నాయకులు వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని, పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, బీజేపీ జిల్లా మోర్చా మహిళా ఉపాధ్యక్షురాలు అలివేలి మంగ, జిల్లా ప్రయాణ కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవీందర్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి భుపేందర్ ఉన్నారు.

హైకోర్టు న్యాయవాది కుమారుడి ఆత్మహత్య

చెన్నూర్: పట్టణానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీరాంభట్ల శరత్‌కుమార్ కుమారుడు రాజీవ్ శర్మ (29) మంగళవారం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. రాజీవ్ శర్మ బెంగళూర్ హైకోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం చెన్నూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాండూర్(బెల్లంపల్లి): తాండూర్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గురువారం తెల్లవారుజామున రైలు ఢీకొన్న ఘటనలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు బెల్లంపల్లి జీఆర్‌పీ అవుట్ పోస్టు హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్తున్న గూడ్స్ రైలు తెల్లవారుజామున 1.40 గంటల ప్రాంతంలో ఢీకొట్టింది. మృతుడు బ్లాక్ అండ్ వైట్ కలర్ ఆఫ్ టీ షర్ట్, లైట్ ప్యారెట్ కలర్ షాట్ ధరించి ఉన్నాడు. అతని వద్ద రెడ్, బ్లూకలర్ బ్లాంకెట్లు ఉన్నాయి. మృతదేహాన్ని బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు 9440900792 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

వాసర వాసికెక్కేనా..?

- యాదాద్రిలా మారనున్న బాసర (వాసర)
- త్వరలోనే ఆలయ పునర్నిర్మాణం
- శృంగేరి పీఠాధిపతుల మార్గదర్శనం
- మంత్రితో ఆలయ బృందం సమీక్ష



శృంగేరి పీఠాధిపతితో ఆలయ నమూనాపై చర్చిస్తున్న బాసర బృందం

భైంసా: బాసర(వాసర) ఆలయ అభివృద్ధికి నూతన సొబగులు కల్పించేందుకు ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. కొన్నిరోజులుగా దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చొరవతో బాసర ఆలయ బృందం అభివృద్ధి, బృహత్ ప్రణాళికలో మార్పులు, చేర్పులపై కసరత్తు ప్రారంభించింది. రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి దూరమైన బాసర ఆలయ పునర్నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఏకైక సరస్వతీ క్షేత్రమైన బాసర ఆలయానికి సంబంధించి ఇప్పటికే రూ.50కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వం ప్రకటించగా బాసర రూపురేఖలు యాదాద్రిలా మారిపోనుందనే భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

శృంగేరికి బాసర బృందం....

ఆలయాల అభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది. నిధులు విడుదల చేసేందుకు సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారనే సంకేతాలు వినిపిస్తున్నాయి. యాదాద్రి తరహాలో దక్షిణ భారత దేశంలోనే ప్రసిద్ధిచెందిన బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శృంగేరి పీఠాధిపతుల మార్గదర్శనం, ఆగమ నిర్దేశం మేరకు బాసర ప్రధాన ఆలయ పునర్నిర్మాణ ప్రక్రియ జరగాలని సీఎం కేసీఆర్ సూచించినట్లు సమాచారం. దీంతో దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశాలను సారం బాసర ఆలయ బృందం మూడు రోజుల క్రితం కర్నాటకలోని శృంగేరి బయలుదేరింది. అక్కడ శృంగేరి పీఠాధిపతి విధుశేఖరభారతి స్వామి కలిసి ఆలయ పరిస్థితిని పునర్నిర్మాణంలో మార్పులు, చేర్పులు, ఇతర విషయాలపై సలహాలు తీసుకున్నారు. ఇప్పుడున్న గర్భాలయాన్ని కృష్ణ శిలలతో అద్భుతంగా నిర్మించడం, సరస్వతీ అమ్మవారి దర్శన అనంతరం పక్కనే ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి ప్రతిమ కనిపించేలా ప్రత్యేక నిర్మాణం చేపట్టనున్నారు. మహాంకాళి అమ్మవారి ప్రతిమ వెనుక ప్రాకార మండపం ప్రాకారం లోపల శివాలయ పునః ప్రతిష్ట, దత్తాత్రేయ స్వామి వారి స్థల మార్పిడి, ఆలయానికి నలుదిక్కుల రాజగోపురాల నిర్మాణం అనివేటి మండప నిర్మాణం, ధ్వజ స్తంభం ఏర్పాటు, ఆలయ ప్రాంగణంలోనే యాగశాల వంటి వాటిపై శృంగేరి పీఠాధిపతి పలు మార్పులు, చేర్పులకు ఆలయ బృందానికి సూచనలు చేశారు.

మంత్రితో సమావేశం...

శృంగేరి పీఠం నుంచి తిరిగి వచ్చిన బాసర బృందం గురువారం రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని నిర్మల్ కలిశారు. శృంగేరిలో పీఠాధిపతి సూచించిన పలు విషయాలను మంత్రికి తెలియజేశారు. అందుకు అనుగుణంగానే ఆలయ పునర్నిర్మాణ ప్లాన్‌ను సిద్ధం చేయాలని మంత్రి తెలిపారు. క్యూ కాంప్లెక్స్, కార్య నిర్వాహణ అధికారి కార్యాలయం, దాతల సాయంతో మరిన్ని వసతి గదులు, ఇతర నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. బాసర మాస్టర్ ప్లాన్‌ను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లిన తర్వాత పనులు చేపడుతామని మంత్రి వెల్లడించారు.

ఇప్పుడైనా జరగాలని...



బాసర ఆలయం

ఎన్నోఏళ్లుగా బాసర ఆలయ అభివృద్ధి కోసం అంతా ఎదురుచూస్తున్నారు. ఇటీవలే సీఎం కేసీఆర్ కొండగట్టుకు రూ. వెయ్యి కోట్లైనా వెచ్చించి పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే యాదాద్రి పనులు పూర్తయ్యాయి. భద్రాచలం, వేములవాడ ఆలయాలకు నిధులు ఇచ్చారు. ఇప్పటికైనా అమ్మవారి ఆలయ అభివృద్ధి చేయాలని అంతా కోరుతున్నారు.

శృంగేరి పీఠాధిపతిని కలిశాం

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచన మేరకు బాసర ఆలయ బృందంతో శృంగేరి వెళ్లి పీఠాధిపతి విధుశేఖరభారతి స్వామిని కలిసి నమూనాలు చూయించాం. చేపట్టే పనులు ఇతర విషయాలపై పీఠాధిపతి పలు సూచనలు ఇచ్చారు. గురువారం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కలిసి పీఠాధిపతి ఇచ్చిన సూచనలను ఆయన దృష్టికి తీసుకువెళ్లాం. త్వరలోనే బాసర ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

– విజయరామారావు, ఆలయ ఈవో

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామ శివారులో పేకాటాడుతున్న ఏడుగురిని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై ఆర్ శంకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు నిర్మల్ సీసీఎస్ ఎస్సై రవి సిబ్బందితో కలిసి నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.34260 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఐదు వాహనాలు సీజ్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పట్టుబడిన వారిలో పలు పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు ఉన్నట్లు సమాచారం.

గుడుంబా స్థావరాలపై దాడులు



ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్

కడెం: మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం ఎక్సైజ్ అధికారులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని 500లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ పేర్కొన్నారు. లక్ష్మిసాగర్ తండాకు చెందిన బానవత్ లత, లింగాపూర్ గ్రామానికి చెందిన కైరం లక్ష్మీ, చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన బానవత్ యమునలపై కేసు నమోదు చేసి ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఇంట్లో కాలిపోయిన సామగ్రి

- రూ.13.22 లక్షల ఆస్తినష్టం



కాలిన వస్తువులు చూపుతున్న బాధితులు

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామంలో గురువారం షార్ట్ సర్క్యూట్‌తో బాయి భోజన్నకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది. బాధిత కుటుంబ సభ్యులు, రెవెన్యూ అధికారుల వివరాల ప్రకారం... గురువారం ఉదయం భోజన్న కుటుంబ సభ్యులు శుభకార్యానికి హాజరయ్యేందుకు భైంసాకు వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఇంట్లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని నిత్యావసర సరుకులు, మూడున్నర తులాల బంగారం ఆభరణాలతో పాటు రూ.7లక్షల వరకు నగదు, ఎలక్ట్రికల్ సామగ్రి కాలిబుడిదైంది. ఈ ప్రమాదంలో రూ.13.22 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై విక్రమ్, ఆర్‌ఐ గంగాధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్‌ఐ గంగాధర్ పంచనామ నిర్వహించారు. బాధిత కుటుంబీకులు రోధించిన తీరు పలువురిని కలిచివేసింది.

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

- రూ.3వేల జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: పెళ్లి చేసుకుంటానని యువతిని లొంగదీసుకొని లైంగికదాడికి పాల్పడిన ఒకరికి పదేళ్ల కఠినకారాగార జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి మాధవికృష్ణ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి జి.పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2021 ఏప్రిల్ 16న గాదిగూడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి అడ శ్రీరామ్ లైంగికదాడికి పాల్పడ్డాడు. యువతి పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడు. దీంతో బాధితురాలు విషయాన్ని కుటుంబీకులకు తెలిపింది. కుటుంబ సభ్యులు గాదిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పీపీ మధుకర్ 15మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు పైవిధంగా జడ్జి తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి తెలిపారు.

బ్లడ్ క్యాన్సర్‌తో బాలుడి మృతి



పెద్ది జశ్వంత్(ఫైల్)

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామానికి చెందిన పెద్ది జశ్వంత్ (12)బ్లడ్ క్యాన్సర్‌తో మృతి చెందాడు. పాండ్వపూర్ గ్రామానికి చెందిన పెద్దిసునీత-రమేశ్ దంపతుల ఏకైక కుమారుడు జశ్వంత్. మండలంలోని అంబారిపేట్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. కొంత కాలంగా బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న జశ్వంత్‌కు తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఈ నెల 22న ఇంటికి వచ్చిన జశ్వంత్ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

కారు, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న ముతేశ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా జగన్నాథ్‌పూర్‌కు చెందిన ఆత్రం ముతేశ్ ఇంద్రవెల్లి మండలంలోని ఇంద్రాయిదేవిని దర్శించుకుని గురువారం రాత్రి బైక్‌పై తిరుగుప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో దంతన్‌పల్లి గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముతేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కి రెఫర్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆ నలుగురికి.. మేమున్నామని..

- అన్నాచెల్లెళ్లకు సాయమందించేందుకు ముందుకు..
- నిత్యావసరాలు అందించిన బాలల సంరక్షణ అధికారులు
- నగదు సాయం చేస్తున్న దాతలు



వంటపాత్రలు, సరుకులు అందిస్తున్న దహెగాం మండల యువకులు

సాక్షి స్పందన

దహెగాం(సిర్పూర్): తల్లిదండ్రుల ప్రేమకు దూరమై అనాథలుగా మారిన అన్నాచెల్లెళ్లను ఆదుకోవడానికి మేమున్నామంటూ పలువురు దాతలు ముందుకొస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న ఆ గిరిజన బిడ్డలకు నిత్యావసర సరుకులు, వంటపాత్రలు, దుస్తులతో పాటు నగదు సాయం అందిస్తున్నారు. దహెగాం మండలం చౌక గ్రామానికి చెందిన సిడాం రాజు అతని చెల్లెళ్లు మమత, దీపిక, దివ్య పడుతున్న అవస్థలపై బుధవారం 'సాక్షి'లో 'అన్న పనిచేస్తేనే.. చెల్లెళ్ల కడుపు నిండేది' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. చిన్నారులకు రెండో రోజు కూడా దాతలు సాయం అందించేందుకు ముందుకొచ్చారు.

నిత్యావసరాలు అందజేత

అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ ఆధ్వర్యంలో అన్నాచెల్లెళ్ల ఇంటికి వెళ్లి నిత్యావసరాలు అందజేశారు. అనాథలైన పిల్లలను ప్రభుత్వం ఆదుకునేందుకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. దీప, దివ్యలను గురుకుల పాఠశాలలో చేర్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగురాలైన దివ్యకు పింఛన్ మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్స్ ప్రవీణ్‌కుమార్, జమున, సఖి సిబ్బంది శ్రీనిధి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి పాల్గొన్నారు.

సాయమందిస్తున్న దాతలు

- దహెగాం మండల కేంద్రంతో పాటు, గిరవెల్లి, పంబాపూర్, మర్రిపల్లి, గ్రామాలకు చెందిన యువకులు వంట పాత్రలు, దుస్తులు, నిత్యావసరాలు, పాఠశాలకు వెళ్లే దీపిక, దివ్యకు స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, పెన్నులు, నోట్ పుస్తకాలు, తదితర వస్తువులు అందజేశారు.
- ఖమ్మం జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు.
- నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన క్రాంతి అతని స్నేహితుల ద్వారా ఆరు నెలలపాటు నెలకు రూ.2 వేలు సాయమందించేందుకు ముందుకు వచ్చారు.
- నర్సాపూర్(జి)కి చెందిన ఉపాధ్యాయుడు నరేందర్ రూ.వెయ్యి అందించారు.
- దహెగాం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. వారి ఇంటికి మరమ్మతు చేయించేందుకు మరికొంత మంది దాతలు ముందుకొచ్చారు.

రూ.9.20 లక్షల గంజాయి పట్టివేత

- నాలుగు సెల్ ఫోన్‌లు, రెండు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని ఉట్నూర్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తుండగా మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44పై గంజాయిని పట్టుకున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసినా విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉట్నూర్ మండలానికి చెందిన మహమ్మద్ సద్దాం ఖాన్, రెహ్మాన్‌ఖాన్, పవార్ రాజు, రాథోడ్ శ్రీకర్, మహమ్మద్ సద్దాం హుస్సేన్, గావాలే తుకారాం, జన్నారం మండలం గొండుగూడకు చెందిన పూజారి వెంకటేష్, నిర్మల్ జిల్లాకు చెందిన మహేష్‌లు స్నేహితులు. వీరు జల్సాలకు అలవాటుపడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని గంజాయి అమ్మడం ప్రారంభించారు. ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దుల్లో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో విక్రయించి లాభలు పంచుకుంటున్నారు. ఎప్పటిలాగే వారం క్రితం వీరు సీలేరు ప్రాంతం వెళ్లి కిలోకు రూ.4వేలు చెల్లించి 110 గంజాయి ప్యాకెట్లను కొనుగోలు చేశారు. ఉట్నూర్‌కు చెందిన తుకారాం ఇంట్లో వాటిని నిల్వ ఉంచారు. మూడు రోజుల తరువాత వెంకటేష్, సద్దాం హుస్సేన్, మహేష్‌లు కలిసి అందులోని 66 ప్యాకెట్లను మహారాష్ట్రలోని అమరావతికి తీసుకెళ్లి విక్రయించారు. అలాగే బుధవారం మిగిలిన 44 ప్యాకెట్లను విక్రయించేందుకు మహారాష్ట్రలోని పుసద్‌కు వెళ్తుండగా పక్కా సమాచారం మేరకు మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. గుడిహత్నూర్ వైపు నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న రెండు కార్లను తనిఖీ చేసి అందులోని గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మహమ్మద్ సద్దాం హుస్సేన్, గావాలే తుకారాం, జన్నారం మండలం గొండుగూడకు చెందిన పూజారి వెంకటేష్, నిర్మల్ జిల్లాకు చెందిన మహేష్‌లు కారును వదిలి పారిపోయారు. మరో నలుగురు ఉట్నూర్ మండలానికి చెందిన మహమ్మద్ సద్దాం ఖాన్, రెహ్మాన్ ఖాన్, పవార్ రాజు, రాథోడ్ శ్రీకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారినుంచి రూ.9.20 లక్షలు విలువ గల 92 కిలోల 132 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాలుగు సెల్ ఫోన్లు, రెండు కార్లను సైతం స్వాధీనపర్చుకున్నారు. గంజాయిని పట్టుకున్న డీఎస్పీ ఉమేందర్, ఆదిలాబాద్ రూరల్ సీఐ రఘుపతి, సీసీఎస్ సీఐ, మావల ఎస్సైని ఎస్పీ అభినందించారు. సీఐ చంద్రమౌళి, ఎస్సై విష్ణువర్ధన్ ఉన్నారు.







శునకాల భయం

నిర్మల్ జిల్లా కేంద్రంలో పట్టపగలు సైతం వీధుల్లో తిరగలేని దుస్థితి నెలకొంది. ఇక రాత్రి వేళల్లో గల్లీలో నడుచుకుంటూ వెళ్లాలంటే భయాందోళన చెందాల్సిన పరిస్థితి. వీధి కుక్కలు ఎక్కడి నుంచి వస్తాయో ఎలా దాడి చేస్తాయోనని స్థానికులు బైక్‌లపై వెళ్తున్నారు. అయినా ద్విచక్ర వాహనాన్ని వెంబడిస్తూ వాహనదారులకు వణుకుపుట్టిస్తున్నాయి. కుక్కల బెడద కేవలం జిల్లా కేంద్రంలోనే కాదు మండలాల్లోనూ నెలకొంది. కుక్కల సంఖ్య పెరుగుతున్నప్పటికీ బల్దియా అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా కుక్కల బెడద తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్